## క్లుప్తంగా

### నేడు మండల సమావేశం

సుండుపల్లె : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం(నేడు)మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలలు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

### 11న ఉచిత వైద్య శిబిరం

రైల్వేకోడూరు : మానవత రైల్వేకోడూరు శాఖ వారి సహకారంతో తిరుపతికి చెందిన అమర హాస్పిటల్ వారు ఈనెల 11వ తేదీ శనివారం రైల్వేకోడూరు టోల్‌గేటు వద్దనున్న హెచ్ఎంఎం హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవత సభ్యులు తెలిపారు. కావున ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఓబులవారిపల్లెలో వర్షం



ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం దాదాపు గంటసేపు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. చాలా రోజుల నుండి మేఘాలు ఊరిస్తున్నా వర్షం కురవలేదు. ఎట్టకేలకు భారీ వర్షం కురవడంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు చేరింది.

### బాధ్యతల స్వీకరణ

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు ఉపాధిహామీ ఏపీఓగా మృత్యుంజయ నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందజేస్తున్న సబ్సిడీ పథకాలు అందించేలా కృషి చేస్తామన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పుల్లంపేట : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడప జిల్లాలోని పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 బేస్‌బాల్ బాలికల విభాగంలో జాస్మిన్, హర్షిత, బాలుర విభాగంలో వర్మ, మోహిత్ ఖాన్‌లు ఎంపికయ్యారు. అలాగే సాఫ్ట్‌బాల్ బాలికల విభాగంలో జాస్మిన్, హర్షిత, సంధ్య, బాలుర విభాగంలో రిషిత్ వర్మ, హేమంత్‌లు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, పీడీ నీలకంఠరావులు అభినందించారు.

### ప్రారంభమైన ఎస్జీఎఫ్ పోటీలు



క్రీడా దుస్తులను ఆవిష్కరిస్తున్న అతిథులు

గాలివీడు : మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ హెచ్ఎస్(బాలుర)లో మండలస్థాయి క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. మండలంలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు ప్రధానోపాధ్యాయులు జాఫర్, మండల క్రీడా సమన్వయకర్త గంగరాజు పేర్కొన్నారు. క్రీడల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓలు నాగరాజు, శ్రీనివాసులు కలిసి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవమ్మ, యదుభూషణ్ రెడ్డి పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ప్రత్యేకంగా తంగాల వెంకటరత్నం విద్యార్థులకు 15 జతల క్రీడా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడికి సత్కారం



బయ్యారెడ్డిని సన్మానిస్తున్న దీఈఓ సుబ్రహ్మణ్యం తదితరులు

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం రాయచోటి డైట్‌లో స్కూల్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేసిన బయ్యారెడ్డిని సహచర ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ ఆయన్ను సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తిలో బయ్యారెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ చిన్నపిల్లల డాక్టర్ బయ్యారెడ్డి, ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సైరాభాను, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, డీసీఈబీ సెక్రటరీ నాగముని రెడ్డి, ఎస్టీయు జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తశుద్ధి కను'మురుగు'

- నివాసాల మధ్య నిలుస్తున్న డ్రైనేజీ నీరు
- అనారోగ్యాల బారిన పడుతున్న ప్రజలు
- మురుగునీటిలోనే నడవాల్సిన దుస్థితి
- చోద్యం చూస్తున్న అధికారులు



రాయచోటి ఒకటవ వార్డులో నిలిచి ఉన్న మురుగునీటిని చూపుతున్న మహిళలు

రాయచోటి అర్బన్ : రాయచోటిలో కనీస సౌకర్యాలు లేక పలు కాలనీల ప్రజలు అరకొర వసతుల నడుమే జీవనం సాగిస్తున్నారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డులో నివాసాల మధ్య మురుగునీరు నిలిచి కంపు కొడుతోంది. నెలల తరబడి సమస్య ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఒకటవ వార్డులోని మొదటి వీధిలో మురుగునీరు నిలిచి ఉన్న సమస్య గత కొన్ని నెలలుగా ఉండటంతో స్థానిక మహిళలు మున్సిపల్, కలెక్టర్ కార్యాలయాలలో అర్జీలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురగునీరు రోడ్డుపైన నిలిచి ఉండటంతో ఎక్కడకు వెళ్లాలన్న మురుగులో నడవాల్సిన దుస్థితి దాపురించిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగునీరు నెలల తరబడి అక్కడే నిలిచిపోతున్నాయని వారు తెలిపారు. వార్డు మొత్తం ప్రభుత్వానికి చెల్లించాల్సిన నీటి పన్ను, ఇంటి పన్నులతో పాటు ఇతర అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా మా సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు తెలుపుతుండటం గమనార్హం.

**అనారోగ్య సమస్యల బారిన..**

వీధిలో మురుగునీరు నిలువ ఉంటూ కంపుకొడుతుండటంతో దోమలు విపరీతంగా ప్రబలుతున్నాయి. దీనికి తోడు తాగునీరు కలుషితం అవుతుండటంతో విష జ్వరాలతో పాటు కీళ్ల నొప్పులు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. నిలిచి ఉన్న నీటిని గతంలో ఒకటి, రెండు సార్లు చిన్నపాటి మోటార్లతో బయటకు తరలించినా, కొద్ది రోజులకు మళ్లీ వీధంతా మురుగునీటితో నిండిపోతోందని వారు స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలుమార్లు అర్జీలు ఇచ్చినా ప్రయోజనం మాత్రం లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

**మురుగుతో ఇబ్బంది పడుతున్నాం**



వీధి నిండా మురుగునీరు వచ్చి చేరింది. దీని వల్ల పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు దాడి చేస్తున్నాయి. ఇంట్లో ఉన్న చిన్న పిల్లలకు జ్వరాలు వస్తున్నాయి. దీంతో వారానికి రెండు సార్లు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఇంతకు ముందు మురుగునీటి సమస్యను లేకుండా చేయాలని, మళ్లీ ఇక్కడ మురుగునీరు నిలవకుండా చేయాలని కోరుతూ మున్సిపాలిటీ లో, కలెక్టర్ ఆఫీసులో అర్జీలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. దీని వల్ల చాలా ఇబ్బంది పడుతున్నాము, ఇప్పటికైనా పరిష్కరించాలని కోరుతున్నాము.

– పి.ఫాతిమా, ఒకటవ వార్డు, రాయచోటి మున్సిపాలిటీ

**జ్వరాలు వస్తున్నాయి**



నెలల తరబడి మురుగునీరు వీధిలో నిలిచి ఉండటం వల్ల దోమలు ఎక్కువగా వస్తున్నాయి. దీని వల్ల చిన్నపిల్లలకు , మహిళలకు ఎక్కువగా జ్వరాలు వస్తున్నాయి. మాకు ఈ సమస్య చాలా రోజుల నుంచి ఉంది. మా వీధిలో మురుగునీరు లేకుండా చేయాలని ఆఫీసుకు వెళ్లి చాలా సార్లు అర్జీలు ఇచ్చినా కూడా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడైనా పట్టించుకుని మాకు ఈ సమస్య లేకుండా చేయాలని కోరుకుంటున్నాము.

– వల్లూరు మహబూబ్ బీ, ఒకటవ వార్డు, రాయచోటి మున్సిపాలిటీ

## జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి



చిట్వేలి: వ్యాసరచన పోటీలలో పాల్గొన్న జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



పెనగలూరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎఫ్ఆర్ఓ ధీరజ్

చిట్వేలి/పెనగలూరు : జాతీయ వన్య ప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాల, పెనగలూరు మండలంలోని మోడల్ స్కూల్‌లో అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పర్యావరణం, జీవ వైవిద్యం పట్ల అవగాహన కలిగి ఉండటంతోపాటు అందరికి తెలియజేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం అలవాటు చేసుకోవాలని సూచించారు. చిట్వేలి అటవీ క్షేత్రాధికారి ధీరజ్ కుమార్, ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ అటవీ నిబంధనలు, సంపద జీవ వైవిద్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ చిట్వేలి మండలంలో ఉపాధ్యాయులు లక్ష్మీ, కళావతి, సుహాసినీ, శివనారాయణ, పెంచల్ దాసు, శుభాష్ చంద్రబోస్, అటవీశాఖ సిబ్బంది, ఎఫ్‌బిఓలు కరిముల్లా, చెంగమ్మ, యశ్వంత్, హరి, పెనగలూరులో జరిగిన కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ సావిత్రి, ఎఫ్‌బీఓలు కెవి సుబ్బయ్య, సుబ్బరాయుడు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సహజ బ్లెస్సీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వీఓఏల సమస్యలు పరిష్కరించండి

రామాపురం : వీఓఏలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీఎం దేవసేనకు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం మండలంలో పని చేస్తున్న వీఓఏలు రామాపురంలోని డ్వామా కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను అధికారులకు తెలియజేశారు. వారు మాట్లాడుతూ తమపై అధిక భారం వేస్తున్నారని చెప్పారు. డ్వాక్రా గ్రూపుల పుస్తకాలు, యాప్‌లలో నమోదు చేయాలని, ఈ సమయంలో తమ మొబైల్‌లో సాంకేతిక సమస్యలతో అవస్థలు పడుతున్నామన్నారు. రికార్డులలో ఏ చిన్న పొరపాటు దొర్లిన వీఓఏలపై చర్యలు తీసుకుంటున్నారనే కానీ తమకు సదుపాయాలు కల్పించడంలో సమస్యలు పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపడంలేదని మండిపడ్డారు. పనికి తగ్గ వేతనం చెల్లించాలని, అలానే పెండింగ్ బకాయిలు విడుదల చేసి తమకు 5జీ మొబైల్ అందించడమే కాక ఆన్‌లైన్ పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి వీఓఏకు గ్రూప్ ఇన్సూరెన్స్, కాలపరమితి సర్క్యులర్ రద్దు చేయాలని, అర్హులకు సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. అలానే తమపై రాజకీయ వేధింపులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలియజేశారు.

### స్టార్టప్‌లతోనే కొత్త ఉద్యోగాలు



మాజీ శాస్త్రవేత్తకు జ్ఞాపికను అందజేస్తున్న చౌప్పా

రాజంపేట : కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖలో ఇంటర్ డిసిప్లినరీ సైబర్ – ఫిజికల్ సిస్టమ్ మిషన్ డైరక్టర్‌గా పనిచేసిన మాజీ శాస్త్రవేత్త డా.కెఆర్ మురళీని అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఎంపవరింగ్ అకాడమిక్ రీసెర్చ్ ఎమర్జింగ్ డొమైన్స్ అండ్ ఫండింగ్ ఆపర్చ్యునిటీస్ అంశంపై బుధవారం గెస్ట్ లెక్చరింగ్ ఇచ్చేందుకు అన్నమాచార్య యూనవర్సిటీకి విచ్చేశారు. ఈ సందర్భంగా చొప్పా గంగిరెడ్డిని డా.మురళీని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ శాస్త్రవేత డా.మురళీ మాట్లాడుతూ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల పరిశోధనలు ఉత్పత్తులుగా మారాలన్నారు. ఆ ఉత్పత్తులు ప్రోటోటైప్ రూపంలో అభివృద్ధి చెందితే అవి స్టార్టప్‌లుగా మారుతాయన్నారు. ఆ స్టార్టప్‌లు కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తాయన్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



ఓబులవారిపల్లె: వైఎస్సార్‌సీపీ అధినేతకు బొకేను అందజేస్తున్న పంజం కుటుంబసభ్యులు



రాయచోటి అర్బన్: వైఎస్ జగన్‌ను కలిసిన బేపారి మహమ్మద్‌ఖాన్



గాలివీడు: మాజీ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న జల్లా సుదర్శన్‌రెడ్డి

గాలివీడు/రాయచోటి అర్బన్/ఓబులవారిపల్లె : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాయచోటి, రైల్వేకోడూరుకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం కలిశారు. విజయవాడ తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల నియమితులైన జల్లా సుదర్శనరెడ్డి రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పలువురు నాయకులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అలానే రాయచోటికి చెందిన మైనార్టీ నాయకులు, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులు బేపారీ మహమ్మద్‌ఖాన్ కలిశారు. మహమ్మద్‌ఖాన్ తండ్రి సీనియర్ నాయకులు బేపారీ బషీర్ ఖాన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అలానే రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, జిల్లా వ్యవసాయ కమిటీ మాజీ అధ్యక్షులు, దివంగత పంజం సుకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సుకుమార్‌రెడ్డి కుమారుడు పంజం శ్రీవర్ధన్‌రెడ్డి పంజం వేణుగోపాల్‌రెడ్డి, పంజం సందీప్‌రెడ్డి బోకేను అందజేశారు. ప్రజల కష్టాలను పరిష్కరించేందుకు కృషి చేస్తూ కూటమి మోసాలను గ్రామాల్లో ఎండగట్టాలని వైఎస్ జగన్ సూచించినట్టు నాయకులు తెలియజేశారన్నారు.

### పారదర్శకంగా రేషన్ పంపిణీ

గాలివీడు : చౌక ధరల దుకాణాల్లో రేషన్ పంపిణీ పారదర్శకంగా జరగాలని తహసీల్దార్ భాగ్యలత డీలర్లకు సూచించారు. బుధవారం మండలంలోని 22, 24, 25 షాపుల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం దుకాణాల్లో సరుకుల పంపిణీ రికార్డులను, నిల్వ వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు కార్డుదారులతో సరుకుల పంపిణీ తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ సకాలంలో పంపిణీ చేయాలని, సక్రమంగా సరుకులు అందించాలని, 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ఇంటవద్దనే పంపిణీ జరిగేలా చూడాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### చౌక దుకాణం తనిఖీ

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల గ్రామం షాపు నెంబర్ 24 చౌక దుకాణాన్ని బుదవారం ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ-పాస్ యంత్రాన్ని తనిఖీ చేసి, స్టాక్‌ను పరిశీలించారు. వృద్ధులకు, దివ్యాంగులకు సంబంధించి ఇంటివద్దకే రేషన్ అందించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐ శ్రీనివాసులనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### చేనేతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

గాలివీడు : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు వీర భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేతన్నల గుంత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలన్నారు. అలాగే ప్రతి నేతన్న కుటుంబానికి రూ.25,000 చేనేత భరోసా ఇవ్వాలని, 50 ఏళ్లు పైబడిన నేతన్నలకు పింఛను మంజూరు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేనేతలను విస్మరించారని విమర్శించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శిబ్యాల వెంకటరమణ, ఓర్సు ఆంజనేయులు, ఓర్సు వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాసిరకం భోజనం

- ఆడపూరు గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీపీ మేడా
- కాంపౌండ్ వాల్ పడిపోవడంపై పాఠశాల సిబ్బందిపై అసహనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు : మండలంలోని ఆడపూరు గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను బుధవారం మధ్యాహ్నం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రాధాకృష్ణన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. పప్పు, తాలింపు నాసిరకంగా ఉందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో వంటశాలను, స్టోర్ రూమ్‌ను, కూరగాయలను పరిశీలించారు. కూరగాయలు నాసిరకంగా ఉన్నాయని, కాంట్రాక్టర్ ఎవరని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కళాశాలలోని తూర్పు ప్రహరీ గోడ పడిపోవడంతో జంతువులు, విషసర్పాలు లోపలికి వస్తున్నాయని విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. గతంలో ఈ ప్రహరీని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి సొంత నిధులతోనే నిర్మించడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయ పరిశీలించి ప్రహరీ నిర్మాణానికి రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో త్వరలో ప్రహరీ గోడను నిర్మిస్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరేశ్వరి, ఆర్ఐ సుశీల్, కాకి చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో వైద్య కళాశాలను పెంచండి



ఖాదర్ మొహిద్దీన్

గాలివీడు : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వైద్య కళాశాలల సంఖ్యను పెంచాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్కె ఖాదర్ మొహిద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతూ పేదల ఆరోగ్యం బాగుండాలంటే వైద్యుల అవసరం ఎంతో ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం వైద్య కళాశాలను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. వైద్య విద్యలో తెలంగాణ కంటే ఏపీ చాలా వెనుకబడిందని, దీంతో అనేక మంది విద్యార్థులు సీట్లు దక్కక ఇతర కోర్సులలో చేరుతున్నారని చెప్పారు. ప్రభుత్వం కాలేజీలను ఏర్పాటు చేయడమే కాక సీట్ల సంఖ్యను పెంచాలని తెలియజేశారు. పేదలకు వైద్య విద్య అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందనేది తెలుసుకోవాలన్నారు. విద్య కోసం పేదరికాన్ని నిర్మూలించగలమని పేర్కొన్నారు.

## జీఎస్టీ సంస్కరణలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సుమయ

రాయచోటి జగదాంబసెంటర్ : జీఎస్టీ సంస్కరణలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తగ్గింపులను అందరూ వినియోగించుకోవాలని రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మునియానాయక్ అన్నారు. కళాశాల విద్యా డైరెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కళాశాలలో జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం కామర్స్ అధ్యాపకులు ప్రసాద్, శ్రీనివాసులు, ఎకనామిక్స్ అధ్యాపకులు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జీఎస్టీలో వచ్చిన మార్పులను విద్యార్థులకు తెలియజేశారు. విద్యారంగంలో నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, ఎరేజర్లపై ఎటువంటి జీఎస్టీ లేదన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాయచోటి సర్కిల్ స్టేట్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ షేక్ సుమయ ముఖ్య అతిథిగా విచ్చేసి జీఎస్టీ సాంకేతిక, పరిపాలనా అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెన్నకేశవ ప్రసాద్, ఈఈఈ విభాగాధిపతి ఇందిరా ప్రియదర్శిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యమే అంగన్‌వాడీలకు శాపం

రాయచోటి అర్బన్ : ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అష్టకష్టాలు పడుతున్నారని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి పేర్కొన్నారు. బుధవారం రాయచోటిలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సకాలంలో బయోమెట్రిక్ వేయకపోవడం, బిల్లులు ప్రభుత్వానికి పంపకపోవడం వల్ల అంగన్‌వాడీలకు 5 నెలలుగా కూరగాయల బిల్లులు, 4 నెలలుగా కేంద్రాల అద్దెలు అందలేదన్నారు. దీంతో అంగన్‌వాడీలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. స్టాక్ పంపిణీలోనూ జాప్యం జరుగుతోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30వ తేదీన మదనపల్లెలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా మహాసభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, రాయచోటి ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, లక్కిరెడ్డిపల్లె అధ్యక్ష, కార్యదర్శులు సుకుమారి, ఓబులమ్మ, తంబళ్లపల్లె కార్యదర్శి గౌరి, మదనపల్లె కార్యదర్శి మధురవాణి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

చిట్వేలి : ప్రజా సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యం కావాలని ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీపీ సభా భవనంలో ఎంపీపీ చంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో విద్య, వైద్యం, మంచినీరు, రెవెన్యూ, పంచాయతీరాజ్ వంటి 18 అంశాలపై సమీక్షను అజెండాగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలస్థాయిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను సభ్యులకు వివరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ చిట్వేలి రేంజ్ పరిధిలో పెద్దపులి సంచరిస్తుందని, కావున అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేనిదే అడవిలోకి వెళ్లరాదని సభ్యులకు తెలియపరిచారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధి రాష్ట్రాభివృద్ధిలో కీలకమని, మూడు నెలల్లో మండలస్థాయి అధికారుల పనితీరు క్షేత్రస్థాయిలో కనిపించాలని తెలియజేశారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే సభకు వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు గ్రామ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎల్‌వీ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు అన్సార్ బాషా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వరలక్ష్మి, సహకార బ్యాంక్ డైరెక్టర్ సుమిత్ర, సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ స్పందన రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ముక్కా సాయివికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కని ఆర్టీసీ అద్దె బస్సులు

- డ్రైవర్లపై దాడులకు నిరసనగా మెరుపు సమ్మె
- డిపోకే పరిమితమైన అద్దె బస్సులు
- అవస్థలుపడ్డ మహిళా ప్రయాణికులు



రాజంపేట: రాజంపేట ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అద్దెబస్సు డ్రైవర్లు

రాజంపేట : కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకంలో లేడీస్ జర్నీకి బ్రేకులు పడ్డాయి. అద్దె బస్సుల డ్రైవర్ల తిరుగుబాటుతో ప్రభుత్వానికి షాక్ ఇచ్చినట్లైంది. ఫలితంగా మహిళా ప్రయాణాలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆర్టీసీలో బస్సు ప్రయాణం సాధారణ ప్రయాణీకులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. లేడీస్ జర్నీకి బ్రేకులు పడ్డాయి. హైవేలోని అన్ని బస్టాండులలో మహిళలు గుంపులుగుంపులుగా ఉండిపోయారు. రాయలసీమలోని రెండు జిల్లాల్లో వేర్వేరు చోట్ల డ్రైవర్లపై జరిగిన దాడుల నేపథ్యంలో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు మెరుపు సమ్మెకు దిగారు. దీంతో రాజంపేట డిపో పరిధిలో అద్దె బస్సులు బుధవారం ఉదయం నుంచి ఆగిపోయాయి. దీంతో ఉచిత బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రక్షణ కల్పించకుంటే బస్సులు నడపలేమని అద్దె బస్సు డ్రైవర్లు ఆందోళనకు దిగారు.

**కడప – తిరుపతి మార్గంలో ప్రయాణికుల నిరీక్షణ**


ఆర్టీసీ బస్సులు సరిపోని పరిస్థితిలో కడప – రేణిగుంట జాతీయ రహదారిలోని రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, భాకరాపేట వరకు బస్టాండుల్లో మహిళలు బస్సుల కోసం పడిగాపులు కాశారు. సమ్మె కారణంగా నడపకపోవడంతో డిపో స్పేర్ బస్సు నడపడానికి కూడా సిబ్బంది లేక డీఎంలు తలలు పట్టుకున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారని ప్రయాణికులు వాపోయారు.

**నిరసనకు దారితీసిన పరిస్థితులిలా..**

రాజంపేట డిపో నుంచి బయలుదేరిన అద్దె బస్సు డ్రైవర్ రైల్వేకోడూరు దాటిన తర్వాత తిరుపతికి వస్తుండగా మార్గమధ్యలో శెట్టిగుంట వద్ద ప్రయాణికులు డ్రైవర్‌పై దాడి చేశారు. అలానే ఆళ్లగడ్డ నుంచి మైదుకూరు వస్తున్న బస్సు డ్రైవర్‌పై దువ్వూరు మండలం గుడిపాడు వద్ద బస్సు దిగిన ప్రయాణికుడు దాడి చేయగా తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ కారణంతో రాజంపేటతో పాటు కడప, కర్నూలు జిల్లాలోని ఏడు డిపోలలో అద్దె బస్సులు రోడెక్కలేదు.

**బస్సులు లేక అగచాట్లు**

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు, రాజంపేట బస్సులు లేక గంటల తరబడి ప్రయాణికులు ఎదురు చూసి అగచాట్లు పడ్డారు. బుధవారం చిన్నఓరంపాడు అడ్డరోడ్డు నందు ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి రోడ్డు పైనే వేచి ఉన్నారు. ఉచిత బస్సులు రాకపోవడంతోపాటు ఆటోలు కూడా అందుబాటులో లేనందున ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



రాజంపేట: డిపోకే పరిమితమైన అద్దెబస్సులు



ఓబులవారిపల్లె: చిన్నఓరంపాడు అడ్డరోడ్డు వద్ద బస్సు కోసం మహిళల నిరీక్షణ